### అధ్యాయము 9

# తెగుళ్లు: పశువులపై తెగులు, దద్దురులు, మరియు వడగండ్లు

తరువాతి మూడు తెగుళ్లను గూర్చి 9వ అధ్యాయము నమోదుచేస్తుంది - ఐదవ తెగులు (పశువులపై తెగులు), ఆరవది (మనుష్యులపై మరియు పశువులపై పొక్కులు), మరియు ఏడవది (వడగండ్లు). ఫరో ముందుకు మరలా వెళ్లి ఇశ్రాయేలును పోనిమ్మని ఆయనను అడగమని దేవుడు మోషేకు ఆజ్ఞాపించాడు. ఒకవేళ ఈ విన్నపమునకు విముఖుడైతే, ఐగుప్తులోని పశువులపై భయంకరమైన తెగులును పంపి ఇశ్రాయేలీయుల యొక్క పశువులను కాపాడతాను అని ఆయన ఫరోతో చెప్పవలసినదిగా దేవుడు చెప్పాడు (9:1-4). దేవుడు చెప్పినట్లుగానే, తదుపరి దినమున ఈ తెగులు ఐగుప్తీయులపై పడింది (9:5, 6). ఇశ్రాయేలును విడిపించుటకు ఫరో ఇంకను నిరాకరించాడు (9:7).

తరువాత, ఐగుప్తీయులను ముందుగా హెచ్చరించకుండానే, దేవుడు మనుష్యులపైనను మరియు పశువులపైనను పొక్కులు అనే తెగులును పంపాడు. ఈ తెగులు ఎంతటి పరివ్యాప్తమైనదంటే ఇది ఐగుప్తీ శకునగాండ్రను ప్రభావితము చేసి వారు దర్బారులోని తమ స్థానములకు రాకుండా చేసింది. ఈ బాధాకరమైన అనుభవము కూడా ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచి వెళ్లుటకు పంపునట్లు ఫరోను ఒప్పించలేక పోయింది (9:8-12).

ఈ అధ్యాయములోని మూడవ తెగులు ప్రకటించే ముందు దేవుడు తన ఉద్దేశములను ప్రకటిస్తున్నాడు. ఇశ్రాయేలు యొక్క విడుదలను అడిగిన పిమ్మట, మరొక తెగులును పంపుతానని దేవుడు వారిని భయపెట్టాడు. కాని, ఈ సారి ఈ తెగులు యెహోవాను మరియు ఆయన యొక్క విశిష్టమైన శక్తిని తెలుసుకొనుటకు ఐగుప్తీయులకు ఒక పాఠమును బోధిస్తుంది అని దేవుడు ప్రకటించాడు (9:13-16). ఫరో యొక్క కాఠిన్యత వలన, పొలములను నాశనము చేసి బయట వాకిండ్లలో బ్రదికియున్న ప్రతి మనుష్యుని పశువుని చంపేటువంటి వదగండ్లను పంపిస్తాను అని దేవుడు చెప్పాడు. ఈ మునుపటి హెచ్చరిక ఐగుప్తీయుల మధ్యలో ఉన్నప్పటికీ కూడా విశ్వాసులు ఆ వడగండ్లను తప్పించుకొనునట్లు చేసింది (9:17-21).

ఆ బెదిరింపు ఆఖరుకు వాస్తవంగా మారింది, మరియు ఐగుప్తు దేశమంతట

వడగండ్ల వాన కురిసింది, కాని ఇశ్రాయేలీయులు నివశించిన చోట మాత్రం కురవలేదు (9:22-26). ఫలితంగా, తాను తప్పు చేస్తున్నాని మొట్టమొదటిసారి ఫరో ఒప్పుకున్నాడు. అప్పుడుఅతను ఇశ్రాయేలును వెళ్లనిచ్చెదనని (మరలా) చెప్పాడు (9:27, 28). మోషే వడగండ్లను ఆపించాడు, కాని ఫరో నిజంగా దేవుని యందు భయము కలిగి లేడని ఆయన అన్నాడు (9:29-33). మరలా, ఆ తెగులు నుండి ఉపశమనమును పొందినప్పుడు, ఫరో తన మనస్సును మార్చుకొని మోషే యొక్క విన్నపమును అవహేళన చేసాడు (9:34, 35).

## పశువులపై తెగులు (9:1-7)

**[1]తరువాత యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు ఫరోయొద్దకు వెళ్లి - నన్ను సేవించుటకు నా ప్రజలను పోనిమ్ము. [2]నీవు వారిని పోనియ్యనొల్లక ఇంకను వారిని నిర్బంధించినయెడల [3]ఇదిగో యెహోవా బాహుబలము పొలములోనున్న నీ పశువులమీదికిని నీ గుఱ్ఱములమీదికిని గాడిదలమీదికిని ఒంటెలమీదికిని ఎద్దుల మీదికిని గొఱ్ఱెల మీదికిని వచ్చును, మిక్కిలి బాధకరమైన తెగులు కలుగును. [4]అయితే యెహోవా ఇశ్రాయేలీయుల పశువులను ఐగుప్తు పశువులను వేరుపరచును; ఇశ్రాయేలీయులకున్న వాటన్నిటిలో ఒక్కటైనను చావదని హెబ్రీయుల దేవుడగు యెహోవా సెలవిచ్చుచున్నాడని అతనితో చెప్పుమనెను. [5]మరియు యెహోవా కాలము నిర్ణయించి - రేపు యెహోవా ఈ దేశములో ఆ కార్యము జరిగించుననెను. [6]మరునాడు యెహోవా ఆ కార్యము చేయగా ఐగుప్తీయుల పశువులన్నియు చచ్చెనుగాని ఇశ్రాయేలీయుల పశువులలో ఒకటియు చావలేదు. [7]ఫరో ఆ సంగతి తెలిసికొన పంపినప్పుడు ఇశ్రాయేలు పశువులలో ఒకటియు చావలేదు; అయినను అప్పటికిని ఫరో హృదయము కఠినమై నందున పంపక పోయెను.**

**వచనములు 1-3.** ఈగల గుంపు విడిచి వెళ్లినప్పుడు **ఫరో** తన హృదయమును కఠినపరచుకొనిన తరువాత, ఇశ్రాయేలీయులు ఆ దేశమును విడచి వెళ్లుటకు అనుమతించాలి లేనిపక్షమున ఐగుప్తు దేశములోని **పశువులపై అతి భయంకరమైన తెగులు**ను అనుభవించుటకు సిద్ధముగా ఉండాలి అని దేవుడు **మోషే** ద్వారా ఆయనకు సందేశాన్ని పంపాడు. "తెగులు" లేదా "గోమారి"గా (KJV) అనువదించబడిన דֶּבֶר (*deber*) అనే హెబ్రీ పదము పరివ్యాప్తమైన ఒక తెగులును సూచించే ఒక అస్పష్టమైన పదము, కాని ఈ తెగులు యొక్క గుణాన్ని గూర్చి నిర్దిష్టమైన ఆధారాలు ఏమి ఇవ్వదు. "జీవులు" (מִקְנֶה, *miqneh*) అనే పదము "పశువులు" (KJV) అని కూడా అనువదించబడింది, ఈ పదము ఈ తెగులు ద్వారా ప్రభావితము చేయబడే అన్ని జీవులను గూర్చి సంబోధించే ఒక సమగ్రమైన పదముగా ఉంది:[1] **గుఱ్ఱములు**, **గాడిదలు**, **ఒంటెలు**, **ఎద్దులు** ("పశువులు"; NIV), మరియు **గొఱ్ఱెలు** ("మేకలు మరియు గొఱ్ఱెలు"; NIV). మరలా, ఫరోతో ఏమి చెప్పాలో దేవుడు మోషేతో చెప్పిన విషయాన్ని ఇక్కడ కథకుడు చెప్పాడు, ఆ తరువాత ఆ సందేశమును మోషే ఫరో వద్దకు తీసుకెళ్లాడు అనే

విషయాన్ని చదువరి విజ్ఞతకే వదిలేసాడు (8:1, 2 వచనములపైగల వ్యాఖ్యానములను చూడండి).

**వచనములు 4, 5.** ఈ తెగులు **యెహోవా** నుండి వచ్చినదే అని చెప్పుటకు ఆధారములు చాలా ఎక్కువ. మొదటిగా, ఈ తెగులు యొక్క తీవ్రతలో దేవుని యొక్క హస్తము కనబడుతుంది, ఎందుకంటే ఇది సమస్తమైన జీవుల యొక్క మరణాన్ని కలిగించింది (9:3). రెండవదిగా, ఈ తెగులులో ఉన్న ఆశ్చర్యం ఏమంటే దాని యొక్క ఎంపిక: దేవుడు ఐగుప్తీయులను బాధించాడు కాని ఇశ్రాయేలీయులను బాధించలేదు (8:22పై వ్యాఖ్యలను చూడండి). మూడవదిగా, ఈ తెగులు వచ్చిన సమయమును పరిశీలిస్తే దేవుడు ఆధీనంలో ఉన్నాడు అనే విషయం విదితమౌతుంది: ఈ తెగులు **రేపు** సంభవిస్తుంది అని మోషే అన్నాడు - అలాగే జరిగింది.

ముందు సంభవించిన తెగుళ్లతో పోల్చితే ఈ తెగులు కొంత వ్యత్యాసమైనది ఎందుకంటే మొదటి సారిగా, ఈ తెగులు వలన ప్రాణనష్టము సంభవించింది (అంటే పశువుల యొక్క ప్రాణము) మరియుఐగుప్తీయుల జీవనాధారమునకు కూడా నష్టము వాటిల్లింది. వారికి వారి పశువులు అవసరం, మాంసము కొరకు మరియు తమ పొలములో పని చేయుటకు. వారి పశువులు చనిపోయినట్లయితే, వారి ఆహారమునకు ఆయువుపట్టు అపాయములో ఉన్నట్లే. ఈ తెగులు "వారి వ్యక్తిగత ఆస్తుల విషయంలో మాట్లాడితే చాలా విశిష్టమైనది. ఈ తెగులుకు మునుపు బాధ మరియు కొంత చిరాకు కలిగింది, కాని తమ వ్యక్తిగత ఆస్తులకు మాత్రం నష్టం వాటిల్లలేదు" అని John J. Davis వ్యాఖ్యానించాడు.[2]

ఐగుప్తీ సంస్కృతిలో అనేక జంతువులు దేవుళ్లకు ప్రతిరూపముగా ఉండేవి. ఆ జంతువులు దేవుళ్ల వలె పరిగణించబడేవి కావు కాని, ఆ దేవుళ్ల యొక్క ప్రతి రూపములుగా లేదా ఘటములుగా ఉండేవి. ఈ ప్రస్తుత వాక్య భాగమునకు పోలినవిగా ఉన్న కొన్ని ఉదాహరణలు చూస్తే ఆవు/గోవు (Hathorకు ప్రతిరూపముగా ఉండేది), దున్న (Apis, Mnevis, లేక Ptahలకు ప్రతిరూపముగా ఉండేది), మరియు గుర్రుపోతు (Amun లేక Khnumకు ప్రతిరూపముగా ఉండేది). పవిత్రమైన జంతువులు తరచు ఆలయములతో ముడిపడి ఉండి యాజకులచే కాపాడబడుతుండేవి. ఈ జంతువులలో అనేకమైనవి వాటి మరణము తరువాత మమ్మీలుగా చేయబడేవి, తమ తమ దేవతల నుండి ఆశీర్వాదములను కోరుకొంటున్న ఆరాధికుల ద్వారా ఈ ఆచారము జరిపింపబడేది.

**వచనము 6.** ఐగుప్తులోని పశువులపై వచ్చిన తెగులు ఏమిటా అనేది ఎవరు కూడా తెలుసుకోలేరు. ఇది దొమ్మరోగం (ఆంథ్రాక్స్) అని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు.[3] కాని, John I. Durham అనే పండితుడు ఈ తెగులును ఒక విదామైన వ్యాధితో గుర్తించే ఒక సాధారణ అవగాహనను వ్యతిరేకించాడు ఎందుకంటే ఈ విధంగా చెయడమంటే "పరిశుద్ధగ్రంథ కథనము యొక్క వేదాంత భావాన్ని తక్కువచేయడం, ఈ భావముఎట్టి విధమైన సహజసిద్ధమైన తద్వారా అద్భుతరహిత 'వివరణ'లను ఉపేక్షించదు."[4] ఏది ఏమైనప్పటికీ కూడా, ఐగుప్తీయుల పశువులపై ఒక మరణార్థమైన తెగులు అది. కాని, **ఐగుప్తీయుల పశువులన్నియు చచ్చెను** అనే మాట

"గొప్ప సంఖ్య"ను సూచిస్తుంది, ఎందుకంటే వడగండ్ల వలన కలిగిన తెగులు ఐగుప్తును విడచిన తరువాత కూడా కొన్ని పశువులు ఇంకను దేశములో ఉన్నాయి (9:19-21). Wilbur Fields వ్రాస్తూ, "9:6లో ప్రయోగించబడిన *అన్నియు* అనే పదము (8:17లో వలె) ఖచ్చితమైన అర్థములో తీసుకోనకూడాదు, కాని గొప్ప పరిమాణముగా పరిగణించాలి, తరువాత మిగిలిన శేషము మునుపటి సంఖ్యతో పోల్చితే ఎందుకు తూగినది కాదు" అని అర్థము అని అన్నాడు.[5] "అన్నియు" అనే పదము తెగుళ్లను గూర్చి చెప్పే కథనములలో అతిశయోక్తిగా ప్రయోగించబడింది, అలాగే ఈ రోజుల్లో కూడా "చాలా," "ఎక్కువ," లేదా "గొప్ప సంఖ్యలో" అనే విషయాన్ని తెలపడానికి చాలా మంది "అన్నియు" లేదా "అందరూ" అనే మాటను ప్రయోగిస్తుంటారు.

**వచనము 7.** ఐగుప్తీయుల యొక్క పశువులు చనిపోయినప్పుడు, ఇశ్రాయేలీయుల యొక్క పశువులు కాపాడబడినాయి.[6] యెహోవా "ఇశ్రాయేలు పశువులకును మరియు ఐగుప్తు పశువులకును మధ్య విభేదమును" కలిగిస్తాను అని యెహోవా ఫరోతో చెప్పాడు (9:4). ఇశ్రాయేలీయుల పశువులు అసలు బాధింపబడనేలేదు అనే వార్తను ఆయన ఖచ్చితంగా వినే ఉంటాడు. దీనికి స్పందిస్తూ, **ఫరో** దూతలను గోషెనుకు **పంపాడు**. కాని, **ఇశ్రాయేలు పశువులలో ఒకటియు చావలేదు** అని తన దూతలు తెచ్చిన వార్తను విన్నప్పుడు కూడా ఇశ్రాయేలు విషయంలో తన మనస్సును మార్చుకొనుటకు ఒప్పుకొనలేదు. ఆయన **హృదయము కఠినపర**చబడింది, మరియు **జనులను పోనిచ్చుటకు** ఆయన మరలా నిరాకరించాడు.

ఇశ్రాయేలీయుల యొక్క పశువులు ఇంకను బ్రతికి ఉన్నవా లేదా అనే విషయాన్ని తెలుసుకొనుటకు ఫరో "పంపినప్పుడు" ప్రయోగింపబడిన సాధారణ హెబ్రీ పదము (שָׁלַח, *shalach*), 1వ వచనములో తన జనులను పోనివ్వాలని ఫరో యెదుట మోషే అడిగినప్పుడు కూడా ఇదే పదము ప్రయోగింపబడింది. ఈ పదసమూహాన్ని Durham "నా జనులను *బయటకు పంపు*" అని అనువదించాడు (ఉద్ఘాటన జోడించబడెను).[7] "తాను పంపనవసరములేనివారిని, అంటే గోషెనులో వాస్తవాలను తెలుసుకొనుటకు పంపినవారిని, ఫరో ఎందుకు పంపుతున్నాడు, కాని పంపాలని యెహోవా ఆజ్ఞాపించినవారిని, అనగా ధార్మికమైన కార్యమును జరిగించుటకు ఇశ్రాయేలీయులను, ఫరో ఎందుకు పంపడం లేదు"[8] అనేది కఠినపరచబడిన ఫరో హృదయమే మనకు వివరిస్తుంది అని ఆయన అభిప్రాయపడ్డాడు.

## పొక్కులు (9:8-12)

**8కాగా యెహోవా - మీరు మీ పిడికిళ్ల నిండా ఆవపు బుగ్గి తీసికొనుడి, మోషే ఫరో కన్నులయెదుట ఆకాశముపైపు దాని చల్లవలెను. 9అప్పుడు అది ఐగుప్తు దేశమంతట సన్నపు ధూళియై ఐగుప్తు దేశమంతట మనుష్యులమీదను జంతువులమీదను పొక్కులు పొక్కు దద్దురులగునని మోషే అహరోనులతో చెప్పెను. 10కాబట్టి వారు ఆవపుబుగ్గి తీసికొనివచ్చి ఫరో యెదుట నిలిచిరి, మోషే ఆకాశమువైపు దాని చల్లగానే అది మనుష్యులకును జంతువులకును పొక్కులు పొక్కు దద్దురులాయెను. 11ఆ**

**దద్దురులవలన శకునగాండ్రు మోషే యెదుట నిలువలేకపోయిరి ఆ దద్దురులు శకునగండ్రకును ఐగుప్తీయులందరికిని పుట్టెను. [12]అయినను యెహోవా మోషేతో చెప్పినట్లు యెహోవా ఫరో హృదయమును కఠినపరచెను, అతడు వారి మాట వినకపోయెను.**

**వచనములు 8-10.** ఈ ఐదవ తెగులు ఐగుప్తులోని జంతువుల శరీరాలను బాధించింది; ఆరవది ఐగుప్తీయులనే నేరుగా బాధించింది, అలాగే మరొకసారి తమ పశువులను కూడా బాధించింది. **మోషే** పిడికిలి నిండా **ఆవపు బుగ్గి తీసుకొని** దానిని గాలిలోకి చల్లాడు, మరియు అతడు చల్లిన ఆ ధూళి **మనుష్యులమీదను జంతువులమీదను . . . దద్దురులుగా అయ్యాయి.** William A. Shell ప్రకారం, ఈ వాక్యములో ప్రయోగించబడిన כִּבְשָׁן (*kibshan*) అనే హెబ్రీ పదము “కుమ్మరి వస్తువులను తయారుచేయు కొలిమిని లేదా కావాల్సిన రూపములోనికి సున్నపు గడ్డలను తరగడం అని సూచిస్తుంది.”[9] “దద్దురు” (שְׁחִין, *sh^e^chin*) అనే పదం అపరిశుభ్రత, గొప్ప బాధ, మరియు ఆఖరుకు మరణమును సైతం కలిగించే చర్మపు దద్దురులను సూచించేదిగా ఉంది (లేవీయ. 13:18-20; యోబు 2:7; 2 రాజులు 20:1, 7). ఈ దద్దురులు కొన్నిసార్లు మానవుని శరీరమంతటా వ్యాపించేవి, “అనగా తన అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు” (యోబు 2:7; ద్వితీ. 28:35 చూడండి). “జంతువులు” (בְּהֵמָה, *b^e^hemah*) అనే పదము సాదుపరచబడిన మరియు క్రూరమైన జంతువులను కూడా సూచించవచ్చు.

మోషే ఇక్కడ చేసిన కార్యమును మనుష్యులను మరియు జంతువులను బాధించునట్లు దేశమంతటా వ్యాపించిన ధూళి మేఘముగా చూడడం కంటే ఒక దృశ్యపరమైన ఉపకరణగానే చూడడం మంచిది. మోషే ఆ బుగ్గిని గాలిలోనికి చల్లగానే ఆ ధూళి తాకినవారందరూ వెంటనే బాధింపబడ్డారు, మరియు అక్కడ నుండే ఈ తెగులు సోకింది. మోషే “బుగ్గిని ఈ విధంగా గాలిలో చల్లడం అనేది (9:10) ఐగుప్తీయుల యొక్క గాలి - దేవత (షో [లేదా షూ]) రానున్న పరిణామాలను ఎదుర్కొనుటకు శక్తిచాలనిదిగా ఉన్నదనే విషయాన్ని వెల్లడిచేస్తుంది”[10] అని కొంతమంది పండితులు సూచిస్తున్నారు. గజ్జిలా పెరుగుతున్న ఆ దద్దురులు ఇంకా చెప్పాలంటే ఐగుప్తీయుల వైద్య దేవుడైన ఇమ్హోతెప్ యొక్క బలహీనతను కూడా బహిర్గతం చేసింది.

ఈగల గుంపులను తీసుకొచ్చిన నాలుగవ తెగులు విషయములో జరిగినట్లుగా మోషే యొక్క దృఢమైన వ్యాఖ్యాన్ని గాని లేదా ఫరోతో ఆయన చెప్పిన హెచ్చరికను కాని ఈ వాక్యము నమోదు చేయుటలేదు (8:24పై వ్యాఖ్యలను చూడండి). కాని, మోషే మరియు ఫరోల మధ్య మాటల సంభాషణను గూర్చి ఇక్కడ చెప్పకపోవడం అనేది దాన్ని చూస్తే అటువంటిది ఇక్కడ జరిగి ఉండదు అనడానికి లేదు. ఫరో “వారి మాటలను వినలేదు” అని 12వ వచనము చెప్తుంది అనే సత్యము నిజానికి మోషే మరియు అహరోనులు ఫరోతో మాట్లాడి మరొకసారి ఇశ్రాయేలు యొక్క విడుదల కొరకు విన్నవించుకున్నారు అని తెలుపుతుంది.

**వచనము 11. శకునగాండ్రు** కూడా ఈ **దద్దురులచే** బాధింపబడ్డారు అనే విషయము

ఈ తెగులు యొక్క సామర్ధ్యతను తెలియజేస్తుంది, ఎంతగా అంటే వారు **మోషే యెదుట నిలువలేక పోయిరి** అని చదువుతాము. మోషే ఫరో ముందు ప్రత్యక్షమైనప్పుడు, తన ప్రయత్నాలను అనుకరించడానికి అక్కడ ఫరో యొక్క శకునగాండ్రు ఉన్నారు అనే విషయాన్ని ఈ మాట సూచిస్తుంది. వారు ఫరో యొక్క దర్బారులో ప్రధానమైన పాత్ర పోషించారని నిర్గమకాండములోని ఆధారాలు తెలుపుతున్నాయి (ఆది. 41:8, 24 చూడండి). ఈ శకునగాండ్రు ఎంతటి శక్తిని కనబరచినప్పటికీ కూడా మోషే, అహరోను మరియు ఇశ్రాయేలు వారు చేసిన ఆ క్రియలతో పోలినవి మాత్రం కాదు అని ఒక నిష్పక్షపాత పరిశీలకుడు చెప్పుటకు ప్రేరేపించబడి ఉంటాడు, ఎందుకంటే మోషే యొక్క దేవుడు చేపట్టిన ఈ దాడి నుండి వారి శక్తులు ఈ శకునగాండ్రను కాపాడలేకపోయాయి. నిర్గమకాండములో శకునగాండ్ర యొక్క ఉనికిని ఈ వచనము ఆఖరుసారిగా ప్రస్తావిస్తుంది.

**వచనము 12.** ఆరవ తెగులు తరువాత ఫరో యొక్క నిరాకరణను గూర్చి రచయిత మాట్లాడినప్పుడు, **యెహోవా ఫరో హృదయమును కఠినపరచెను** అని మొదటిసారి ఈ తెగుళ్ల పరంపరలో చెప్తున్నాడు. ఫరో తన తిరుగుబాటు, అహంకార బుద్ధిని చూపిన తరువాతనే దేవుడు తన హృదయమును కఠినపరచాడు, బహుశా తనలోని ఆ మొండితనాన్ని మరింత పటిష్టం చేయుట ద్వారా కాబోలు. మరలా, ఫరో యొక్క నిరాకరణ అనేది ఆశ్చర్యమును కలిగించలేదు, ఎందుకంటే దేవుడే దీనిని గూర్చి ముందుగా చెప్పాడు అని ఈ వాక్యము ఉద్ఘాటిస్తుంది (7:3, 4; 8:15పై గల వ్యాఖ్యలను చూడండి).

## వడగండ్లు (9:13-35)

### వడగండ్లను గూర్చిన హెచ్చరిక (9:13-21)

**13తరువాత యెహోవా మోషేతో ఇట్లనెను - హెబ్రీయుల దేవుడైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు; నీవు తెల్లవారగానే లేచిపోయి ఫరోయెదుట నిలిచి - నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము. 14సమస్త భూమిలో నావంటివారెవరును లేరని నీవు తెలిసికొనవలెనని ఈ సారి నేను నా తెగుళ్లన్నియు నీ హృదయమునొచ్చునంతగా నీ సేవకులమీదికిని నీ ప్రజలమీదికిని పంపెదను; 15భూమిమీద నుండకుండ నీవు నశించిపోవునట్లు నేను నా చెయ్యి చాపియుంటినేని నిన్నును నీ జనులను తెగులుతో కొట్టివేసియుందును. 16నా బలమును నీకు చూపునట్లును, భూలోకమందంతట నా నామమును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని. 17నీవు ఇంకా నా ప్రజలను పోనియ్యనొల్లక వారిమీద అతిశయపడుచున్నావు. 18ఇదిగో రేపు ఈ వేళకు నేను మిక్కిలి బాధకరమైన వడగండ్లను కురిపించెదను; ఐగుప్తు రాజ్యము స్థాపించిన దినము మొదలుకొని యిదివరకు అందులో అట్టి వడగండ్లు పడలేదు. 19కాబట్టి నీవు ఇప్పుడు పంపి నీ పశువులను పొలములలో నీకు కలిగి నది యావత్తును త్వరగా**

**భద్రముచేయుము. ఇంటికి రప్పింపబడక పొలములో ఉండు ప్రతి మనుష్యునిమీదను జంతువుమీదను వడగండ్లు కురియును, అప్పుడు అవి చచ్చునని చెప్పుమనెను. [20]ఫరో సేవకులలో యెహోవా మాటకు భయపడినవాడు తన సేవకులను తన పశువులను ఇండ్లలోనికి త్వరగా రప్పించెను. [21]అయితే యెహోవా మాట లక్ష్యపెట్టనివాడు తన పనివారిని తన పశువులను పొలములో ఉండనిచ్చెను.**

**వచనము 13.** మొదటి మరియు నాలుగవ తెగులు విషయములో చేసినట్లుగానే (7:15; 8:20), ఆ ఏడవ తెగులు **తెల్లవారగానే** వస్తుందని **మోషే ఫరోతో** చెప్పాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఈ సారి ఫరోను యేటివద్ద కలుసుకొనమని దేవుడు మోషేతో చెప్పలేదు. మోషే యెహోవా యొక్క ఆజ్ఞలను నెరవేర్చాడు అని వాక్యము చెప్పుటలేదు, కాని ఆయన చేసాడు అని చదువరి గ్రహించగలడు. మోషే యొక్క విజ్ఞాపన ఏమి మారలేదు: **నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము అనిహెబ్రీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చుచున్నాడు.**

**వచనము 14.** మోషే ఇవ్వవలసిన వివరణ ఇప్పటివరకు తాను ఫరోకు అందజేసిన అన్ని సందేశాలన్నిటిని కూడా మించినదిగా ఉంది. మొదటిగా, ఇతర ఉపద్రవాలు వస్తాయి అని దేవుడు స్పష్టంగా చెప్పాడు, ఈ సత్యాన్ని ఆయన మునుపు ఫరోకు బయలుపరచలేదు. **నా తెగుళ్లన్నియు** అని మాట్లాడుటలో, ఇంకను భవిష్యత్తులో రానున్న తెగుళ్ల "అన్నిటిని" గూర్చి బహుశా దేవుడు మాట్లాడుతున్నాడేమో. రెండవదిగా, ఫరో మీదకును మరియు ఆయన దేశము మీదకును తెగుళ్లను దేవుడు ఎందుకు రప్పిస్తున్నాడో దేవుడు బయలుపరుస్తున్నాడు: **సమస్త భూమిలో నావంటివారెవరును లేరని నీవు తెలిసికొనవలెనని.** యెహోవా చాలా ప్రత్యేకమైనవాడు, ఐగుప్తుదేశపు దేవుళ్లతో పోల్చదగినవాడు కాడు అని ఫరో నేర్చుకుంటాడు.

**వచనములు 15, 16.** నిజానికి, ఐగుప్తీయులను సమూలంగా నాశనం చేసి ఉండవచ్చు - మరియు ఖచ్చితంగానే చేసి ఉండవచ్చు, కాని తన **శక్తిని** వారి ముందు కనబరచుటకు ఈ తెగుళ్లను ఉపయోగించుకోవడం ఆయన యొక్క ఉద్దేశం అని దేవుడు చెప్పి ఉండవచ్చు. ఈ విధంగా వెల్లడి చేయుటవలన, యెహోవా యొక్క **నామము సమస్త భూమిలో** ప్రకటించబడుతుంది. Waldemar Janzen వ్యాఖ్యానిస్తూ,

> దేవుని యొక్క గురి ఇశ్రాయేలును తమ ప్రస్తుత బాధనుండి విడిపించడమే కాదు, దీనిని దేవుడు చాలా వేగంగానే చేయగలిగేవాడు, కాని దేవుని యొక్క నామమును (అనగా విమోచకునిగా ఆయన యొక్క గుణమును; af. 3:13-15; 20:1-2తో పోల్చి చూడండి) ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడము కూడా. ఐగుప్తు మరియు ఇశ్రాయేలు మాత్రమే కాక, సమస్త దేశములు హింసకాండను వ్యతిరేకించే ఈ దేవుని యొక్క విశ్వపాలనను గుర్తించాలి.[11]

వాస్తవంగా, ఐగుప్తులో దేవుడు చేసిన మహోత్తర కార్యములు తదుపరి సంవత్సరములలో ఇశ్రాయేలీయులు ఎదుర్కొన్న అనేకమైన అన్యదేశములనే ఎక్కువగా ప్రభావితం చేసాయి (18:1; యెహో. 2:10, 11; 9:9; 1 సమూ. 4:8).

క్రొత్తనిబంధనలో, దేవుని యొక్క సార్వభౌమ అధికారమునకు పౌలు ఇక్కడి 16వ వచనమును ఒక సరియైన ఉదాహరణగా చూపాడు (రోమా. 9:17).

**వచనము 17.** పిమ్మట దేవుడు ఫరో యొక్క పాపమును నిర్థారించాడు: **నీవు ఇంకా నా ప్రజలను పోనియ్యనొల్లక వారిమీద అతిశయపడుచున్నావు.** ఫరో యొక్క సమస్య ఏమంటే గర్వము మరియు అహంకారము; ఆయన చాలా తక్కువ జాతి వారిగా పరిగణించిన ప్రజల యొక్క దేవుని నుండి ఆజ్ఞలను పొందుటకు ఆయన నిరాకరించాడు.

**వచనము 18.** తరువాత రాబోవుచున్న తెగులును మోషే ప్రకటించాడు, **ఐగుప్తు** దేశం ఇంతకుముందు చూడనటువంటి అత్యంత వినాశనాత్మకమైన **వడగండ్లు. ఐగుప్తు రాజ్యము స్థాపించిన దినము మొదలుకొని యిది వరకు** అనే మాట చరిత్ర యొక్క చక్రీయమైన దృష్టినికాక, సరళ దృష్టిని సూచిస్తుంది. ఇటువంటి భావములే లేఖనములలో ఇతర చోట్ల కూడా కనబడతాయి (10:6; సంఖ్యా. 14:19; ఎజ్రా 9:7; యిర్మీయా 7:25; 32:31; మత్తయి 24:21; ఫిలిప్పీయులకు 1:5).

**వచనము 19.** ఈ యొక్క సదరు ప్రకటన కొంచెం వ్యత్యాసమైనది. తమ ప్రజలయొక్కయు మరియు **పశువుల** యొక్కయు ప్రాణములను కాపాడుకొనుటకుగాను మోషే ఐగుప్తీయులకు ఒక అవకాశాన్ని ఈ సందర్భంగా ఇచ్చాడు. వడగండ్లు రానున్నాయి అని ఎరిగి (మరియు అది వచ్చునప్పుడు), తమ సేవకులకు మరియు తమ ధాన్యాల నిల్వలకు మరియు యిండ్లలో తమ జీవితములను కాపాడుకొనుటకు ఐగుప్తీయులు ప్రయత్నం చేయగలరు.

**వచనములు 20, 21.** ఏమి జరిగినదో చెప్పుటకు ఇక్కడ కథకుడు వెంటనే కథనము యొక్క అంతమునకు వెళ్లిపోయాడు. ఎందరైతే దేవునియందు విశ్వసించి ఆయనను గౌరవించారో వారు తమ **సేవకుల ప్రాణములను** మరియు **పశువులను** కాపాడుకోగలిగారు. ఇతరులు దేవుని యొక్క సందేశమునకు చెవియొగ్గ లేదు; బహుశా, అట్టివారి ప్రజలు మరియు వారి జంతువులు వడగండ్ల వాన కురిసినప్పుడు చనిపోయి ఉంటారు.

ఒక ఆశ్చర్యకరమైన ప్రకటన ఒకటి ఇక్కడ చేయబడింది: కొంతమంది ఐగుప్తీయులు **యెహోవా మాటకు భయపడినవారు** ఉన్నారు. ఈ ఐగుప్తీయులే **ఫరో యొక్క సేవకులుగా** కూడా పిలువబడ్డారు. ఫరో యొక్క సేవకులలో కొంతమందినిదేవుడు మెట్టుకు మార్చగలిగాడు! ఈ కథనమునకు మునుపు మరియు తరువాత కూడా, ఫరో ఒక్క "సేవకులు" ఐగుప్తీ "ప్రజల" నుండి వేరుగానే చూపించబడ్డారు (8:3, 21; 9:14; 10:6; 11:3; 12:30). బహుశా వీరు ఫరోకు సలహాదారులుగా ఉంది ఆయన యొక్క దర్బారులో పని చేసిన ప్రభుత్వ అధికారులై ఉంటారు (7:10, 20; 9:30, 34; 10:7; 11:8; 14:5). కాగా, "ఫరో నేర్చుకొన్న సమస్త విషయములలో వీరు రహస్య అనూయాయులు."[12] ఈ సందర్భంలో, మోషే యొక్క హెచ్చరికను వినిన రాజుగారి అధికారులలో కొందరు వారు వినిన ప్రకారంగా చేసారు.

**వడగండ్ల వాన కురియుట (9:22-26)**

**[22]యెహోవా - నీ చెయ్యి ఆకాశమువైపు చూపుము; ఐగుప్తుదేశమందలి మనుష్యులమీదను జంతువులమీదను పొలముల కూరలన్నిటిమీదను వడగండ్లు ఐగుప్తు దేశమంతట పడునని మోషేతో చెప్పెను. [23]మోషే తన కఱ్ఱను ఆకాశమువైపు ఎత్తినప్పుడు యెహోవా ఉరుములను వడగండ్లను కలుగజేయగా పిడుగులు భూమిమీద పడుచుండెను. యెహోవా ఐగుప్తుదేశముమీద వడగండ్లు కురిపించెను. [24]అలాగు వడగండ్లును వడగండ్లతో కలిపిన పిడిగులును బహుబలమైన వాయెను. ఐగుప్తు దేశమందంతటను అది రాజ్యమైనది మొదలుకొని యెన్నడును అట్టివి కలుగలేదు. [25]ఆ వడగండ్లు ఐగుప్తుదేశమందంతట మనుష్యులనేమి జంతువుల నేమి బయటనున్నది యావత్తును నశింపచేసెను. వడగండ్లు పొలములోని ప్రతి కూరను చెడగొట్టెను, పొలములోని ప్రతి చెట్టును విరుగగొట్టెను. [26]అయితే ఇశ్రాయేలీయులున్న గోషెను దేశములో మాత్రము వడగండ్లు పడలేదు.**

**వచనములు 22, 23a.** రాబోవుచున్న ఆ తెగులును గూర్చిన ప్రకటన చేసిన తరువాత, దేవుని ఆజ్ఞతో **మోషే తన చెయ్యిని ఆకాశమువైపు** చాచాడు తద్వారా ఈ **వడగండ్ల** వర్షమునకు కారకుడు యెహోవాయే అనే విషయములో ఎట్టి అనుమానము లేదు. ఆయన ఈ సంజ్ఞ చేసినప్పుడు, వడగండ్ల వర్షము మొదలైంది. ఇ తర తెగుళ్లు ఎంతటి పరివ్యాప్తంగా ఉన్నాయో ఇది కూడా అంతగానే వ్యాపించి ఉంది. **ఐగుప్తుదేశమందంతట మనుష్యులనేమి జంతువులనేమి బయటనున్నది యావత్తును నశింపచేసెను.**

**వచనములు 23b-25.** ఈ తెగులులో కేవలం **వడగండ్లు** మాత్రమే లేవు; **ఉరుములు**, మెరుపులు, మరియు వర్షము కూడా పడింది (9:33). "ఉరుము" అనే పదము קֹל (*qol*) అనే హెబ్రీ పదము యొక్క బహువచన పదము నుండి అనువదింపబడింది, ఈ పదమే తరచూ "స్వరము"ను సూచిస్తుంది. యెహోవా స్వరము యొక్క శక్తే ఉరుము వలె గర్జించుచున్నది (కీర్తన 29:3). వివరణాత్మకమైన మాటలలో **భూమి మీదికి అగ్ని దిగి వచ్చింది** మరియు**అగ్ని ఆగక మెరుస్తూనే ఉంది**, "అగ్ని" (אֵשׁ, *'esh*) అనే పదమును "మెరుపు"గా మనం అర్థంచేసుకోవాలి (NIV; CEV; NCV). ఈ దేశము ఇంతవరకుచూచిన వడగండ్ల వానలలో ఇది అత్యంత దుర్భరమైనది, ఇది ప్రతియొక్క **మనుష్యుని మరియు జంతువుని** తాకి చంపింది (9:19), అలాగే **ప్రతి మొక్కను** మరియు **వృక్షమును** (10:5పై వ్యాఖ్యలను చూడండి) కూడా నాశనము చేసింది. ఐగుప్తీయులచే ఆరాధింపబడే దేవుళ్లు తమ ప్రజలను రక్షించుటకు ఏమియు చేయలేకపోయారు - నట్ అయినా (ఆకాశపు దేవత), ఐసిస్ (జీవ దేవత), లేదా షేతు (పంటలను కాపాడే దేవత) ఇలా ఏ ఒక్క దేవత కూడా వారిని కాపాడలేకపోయింది.

**వచనము 26.** ఈగల గుంపుల తెగులులో లాగానే (8:22, 23) మరియు పశువులపై వచ్చిన తెగులులో లాగానే (9:4), ఇస్రాయేలేయులు నివశిస్తున్న **గోషెను దేశము** మాత్రం ఈ తెగులు అంటకుండా కాపాడబడింది. తన ప్రజలకును తమను

బాదిన్చుచున్న ప్రజలకును మధ్య దేవుడు వ్యత్యాసాన్ని చూపించాడు.

**వడగండ్లు మరియు ఉరుములు ఆపబడినవి (9:27-35)**

**[27]ఇది చూడగా ఫరో మోషే అహరోనులను పిలువనంపి - నేను ఈసారి**
**పాపముచేసియున్నాను; యెహోవా న్యాయవంతుడు, నేనును నా జనులును**
**దుర్మార్గులము; [28]ఇంతమట్టుకు చాలును; ఇకను బ్రహ్మాండమైన ఉరుములు వడగండ్లు**
**రాకుండునట్లు యెహోవాను వేడుకొనుడి, మిమ్మును పోనిచ్చెదను, మిమ్మును ఇకను**
**నిలుపనని వారితో చెప్పగా [29]మోషే అతని చూచి - నేను ఈ పట్టణము నుండి బయలు**
**వెళ్లగానే నా చేతులు యెహోవావైపు ఎత్తెదను. ఈ ఉరుములు మానును, ఈ వడగండ్లును**
**ఇకమీదట పడవు. అందువలన భూమి యెహోవాదని నీకు తెలియబడును. [30]అయినను**
**నీవును నీ సేవ్వకులును ఇకను దేవుడైన యెహోవాకు భయపడరని నాకు**
**తెలిసియున్నదనెను. [31]అప్పుడు జనుపచెట్లు పువ్వులు పూసెను, యవలచేలు**
**వెన్నులు వేసినవి గనుక జనుపయవల చేలును చెడగొట్టబడెను గాని [32]గోధుమలు**
**మెరపములకలు ఎదగనందున అవి చెడగొట్ట బడలేదు. [33]మోషే ఫరోను విడిచి ఆ**
**పట్టణమునుండి బయలువెళ్లి యెహోవావైపు తన చేతులు ఎత్తినప్పుడు ఆ**
**యురుములును వడగండ్లును నిలిచిపోయెను, వర్షము భూమిమీద కురియుట మానెను.**
**[34]అయితే ఫరో వర్షమును వడగండ్లును ఉరుములును నిలిచిపోవుట చూచి, అతడును**
**అతని సేవకులును ఇంక పాపము చేయుచు తమ హృదయములను కఠినపరచుకొనిరి.**
**[35]యెహోవా మోషే ద్వారా పలికినట్లు ఫరో హృదయము కఠినమాయెను; అతడు**
**ఇశ్రాయేలీయులను పోనియ్యకపోయెను.**

**వచనము 27.** ఇప్పటికీ ఐగుప్తీయులు అనుభవించిన తెగుళ్లలో వడగండ్లనే తెగులు అత్యంత భయానకమైనది. మొట్టమొదటిసారిగా, నేను పాపం చేసియున్నాను[13] **- యెహోవా న్యాయవంతుడు, నేనును నా జనులును దుర్మార్గులము** అని ఫరో ఒప్పుకొన్నాడు. అయితే, తరువాత సంఘటనలు, ఫరో ప్రాయశ్చిత్తంపై అనుమానమును రేకెత్తించింది. బహుశా, తెగుళ్ల నుండి విడిపించబడాలనే కోరికవలనే అతడు పశ్చాత్తాపపడ్డాడు. ఈ పోటీలో/వివాదంలో దేవునికి వ్యతిరేకంగా అతడు తప్పు చేస్తున్నాడని ఒకవేళ అతడు గ్రహిస్తే, తరువాత అతని యొక్క దురహంకార మార్గాలు మారేవి. ఫరో మాటల ఒక జ్ఞాపకంగా మాత్రమే పనిచేస్తాయి, "నేను పాపముచేసి యున్నాను" అని చెప్పడం ఒకరికి రక్షణ హామీని కలిగించదు.

"నేనును నా జనులును దుర్మార్గులము"? అను ఫరో ఒప్పుకోలులో తనతో పాటు తన ప్రజలను ఎందుకు చేర్చుకొన్నాడు, ఒక విధంగా ఇశ్రాయేలీయులను బానిసలుగా ఉంచడం వలన ప్రజలు "దుర్మార్గులైతిరి." ఇశ్రాయేలీయుల బానిసత్వం కేవలం ఫరో ద్వారానే సాధించబడలేదు. బహుశా, ఇశ్రాయేలీయులను వెళ్లనియ్యకుండ ఫరో యొక్క కఠినాత్మకమైన నియమాలను ప్రోత్సహించుట చేత ఫరో దోషములో వీరును పాలిభాగస్తులైరి. ఉదాహరణకు, వచనము 34లో, ఫరో మాత్రమే పాపము

చేయలేదుగాని అతని సేవకులు కూడా పాపము చేసిరని వాక్యభాగం చెప్తుంది.

**వచనము 28.** మోషే మరియు అహరోనులను తన యొద్దకు పిలిచినప్పుడు, వడగండ్లు తొలగించాల్సిందిగా ఆత్రుతతో ఉన్నాడు. కాబట్టి, ఐగుప్తీయుల పక్షంగా దేవునితో విజ్ఞాపన చేయమని అతడు (ఫరో) వారిని అడిగాడు. మరోసారి **మిమ్మును** [ఇశ్రాయేలీయులను] **పోనిచ్చెదనని** అతడు ప్రమాణం చేసాడు.

**వచనము 29.** అతని ఆజ్ఞవలన వడగండ్లు మొదలైనట్లు, ఆయన ద్వారానే అవి ముగించబడుతున్నట్లు ఐగుప్తీయులకు తెలిసే విధంగా చేసి **మోషే** అంగీకరిచాడు. దేవుడే తెగుళ్లను పంపెనని మరియు ఫరోకు యెహోవా **తెలియబడులాగున** వాటిని తీసివేస్తాడని పునరుద్ఘాటించెను. ఈ సందర్భంలో, ఫరో **భూమి యెహోవాదని తెలుసుకుంటాడని** ఆయన పేర్కొన్నాడు. తెగులు ఈ సత్యమును ప్రదర్శిస్తుంది: భూమి యెహోవాది గనుక, ఆయనకు ప్రకృతిపై నియంత్రణ ఉంది మరియు ఎప్పుడైనా, ఎక్కడైనా వడగండ్లను కురిపించగలడు.ఫరో వడగండ్లవాన నుండి ఆ పాఠమును నేర్చుకొనియుండాలి.

**వచనము 30.** ఫరో మరియు అతని **సేవకులు ఇకను దేవుడైన యెహోవాకు భయపడరన్న** విషయం మోషే తెలుసని పలుకుతూ కొనసాగించాడు. ఆ క్షణంలో ఒకవేళ ఫరో నిజాయితీగా ఉన్నను, ఫరో హృదయం తరువాత కఠినమై మరియు అదనంగా మరికొన్ని తెగుళ్లు వస్తాయన్న విషయం దైవప్రేరణ చేత మోషేకు తెలుసు.

**వచనములు 31, 32.** కథనంలో ఈ సమయమందు, రచయిత వడగండ్ల వాన వచ్చినప్పుడు అని చెప్పే కుండలీకరణ గమనికను (గుర్తును) జోడించడానికి రచయిత ఆగాడు: **అప్పుడు జనుపచెట్లు పువ్వులు పూసెను, యవలచేలు వెన్నులు వేసినవి గనుక జనుప యవలచేలును చెడగొట్టబడెనుగాని గోధుమలు మెరపమొలకలు ఎదగనందున అవి చెడగొట్టబడలేదు.** W. H. Gispen చెప్పాడు, "దుస్తుల కొరకు అవిసె నార తీయడానికి జనుపచెట్లను ఐగుప్తులో పెంచేవారు (యెండిన పీనుగను చుట్టడానికి కూడా నారను ఉపయోగించేవారు). మెరప మొలకలు అంటే ముతక గోధుమలో ఒక రకం మరియు యవల తరువాత వీటిని పెంచేవారు. ఐగుప్తీయులు మెరపలను రొట్టెలు కాల్చుటకు ఉపయోగించేవారు."[14] నమోదుచేయబడిన సమయము బహుశా జనవరి కావచ్చు అని వ్యాఖ్యానకర్తల అభిప్రాయం. చివరి తెగులు మరియు ఐగుప్తు నుండి విమోచన యొక్క తేది అనగా పస్కా తారీఖు ఏప్రిల్ నేల కావచ్చు. కాబట్టి, సుమారు చివరి మూడు తెగుళ్లకు మూడు నెలలు మిగిలాయి.

**వచనము 33. మోషే** మరలా **యెహోవా వైపు తన చేతులను ఎత్తెను.** మరలా, మోషే ద్వారానే ఈ తెగులు ముగియబడినదని ఈ సంజ్ఞ స్పష్టం చేస్తుంది. అదే సమయంలో, యెహోవాకు విజ్ఞాపన చేయుట ద్వారానే ఈ వడగండ్ల వానను ఆపగలనని మోషే తెలియజేస్తున్నాడు. ప్రాచీన కాలంలో, దేవుని వైపు తమ చేతులను ఎత్తుట చేత మానవును దేవునికి ప్రార్థించేవారు (1 రాజులు 8:22, 38, 54; ఎజ్రా 9:5; కీర్త. 44:20; 88:9; 143:6; యెష. 1:15; 1 తిమోతి 2:8). మోషే ప్రార్థించిన పిమ్మట, **ఉరుములు** మరియు **వడగండ్లు** అకస్మాత్తుగా ముగిసింది.

**వచనములు 34, 35.** తెగులు ఆగిపోవడం చూచినప్పుడు మరియు ఉపశమన

భావన కలిగినప్పుడు, **ఫరో** తన స్థానమును గూర్చి మరలా ఆలోచించెను. బహుశా ఆయన ఇలా ఈ విధంగా చెప్పియుండవచ్చును: "వడగండ్లు ఆగిపోయాయి; భూమి రక్షించబడింది. అది కేవలం దాని కాలంలో దానంతట అదే వచ్చియుండవచ్చు. బహుశా మోషే మరియు ఆయన దేవుడు దీనిలో చేసింది ఏమీ లేదు. ఏ సందర్భంలోనైనా, మన బానిస కార్మికులను మనం కోల్పోకూడాదు. మనకు జరిగే కష్ట పరిస్థితిలో మనం జీవించవచ్చు. నేను ఇశ్రాయేలీయులను ఎందుకు పోనియ్యాలి? నేను అది చేయను!" తుఫాను ముగియడం ఫరో చూచినప్పుడు **అతడును** మరియు **అతని సేవకులును ఇంక పాపము చేయుచు తన హృదయమును కఠినపరచుకొని**, మరియు ఇశ్రాయేలీయులను పోనియ్యక పోయెను అని మాత్రమే వాక్యభాగంలో చెప్పబడింది. నిజానికి, ఇవన్నీ తరచుగా దేవుడు చెప్పినవే.

## అన్వయము

### "భూలోకమంతటికి దేవుడు" (9:16)

తెగుళ్లను గూర్చి చెప్పబడిన కథనములో, మనము ఈ ఆశ్చర్యమైన ప్రకటనను చూస్తాము: "నా బలమును నీకు చూపునట్లును, భూలోకమందంతట నా నామమును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని" (9:16). బహుశా ఈ వచనం ఆశ్చర్యంగా ఉండవచ్చు ఎందుకంటే పాత నిబంధన దేవుడు "భూమియంతట" పట్ల అంటే ఇశ్రాయేలు కాకుండా ఇతర రాజ్యాల పట్ల శ్రద్ధ కలిగియున్నాడని ఆలోచించే అలవాటు మనకు లేదు. ఆయన నామము ప్రచురము చేయాలని దేవుడు కోరుకొంటున్నాడను దానికి అర్థమేమనగా ఆయన బలము మరియు శక్తి "భూలోకమందంతట" ప్రచురము చేయబడాలని ఈ వాక్యభాగము మనకు బోధిస్తుంది. పాత నిబంధనలో దేవునికి ఇశ్రాయేలీయుల పట్ల ప్రత్యేక సంబంధం ఉన్నప్పటికీ, అయన భులోకమందంతటికీ దేవుడే.

*దేవుడు అన్ని రాజ్యాలను ఆశీర్వదిస్తాడు.* ఈ సత్యము క్రొత్త నిబంధన సువార్తికుల యొక్క ముఖ్యాంశం మరి ప్రత్యేకంగా సువార్తికులు అన్యులతో మాట్లాడినప్పుడు (అపొ. 14:16, 17; 17:25; రోమా 1:19-21 చూడండి).

*దేవుడు దేశముల (రాజ్యముల) విధులను నియంత్రిస్తాడు.* ఫరో విధికి ఆయనే బాధ్యుడని దేవుడు 9:16లో స్పష్టంగా తెలియజేసాడు: "ఇందుకే నేను నిన్ను నియమించితిని" (NRSV). తనకు విధేయులైన వారిని మాత్రమే దేవుడు పాలించడు గాని భూమియంతటిని పాలించువాడు (ద్వితీ. 10:14; దాని. 4:17, 25, 32). ఈ భావమును వ్యక్తపరచే ఒక మార్గం ఏంటంటే దేవుడు "చరిత్రంతటికీ అధిపతి."[15] ఆయన చిత్తమును జరిగించుటకు మరియు తన సొంత ప్రజలను శిక్షించుటకు ఆయన శక్తివంతమైన రాజ్యాలను పరికరాలుగా ఉపయోగిస్తాడు (హబ. 1-3 చూడండి). ఆయన ముందుండి, "శాసించి మరియు మార్గదర్శకంగా ఉండే న్యాయవంతుడు మరియు పరిశుద్ధమైన పాలకుడు (2 రాజులు 19:25, 28; యెషా. 38:3-4, 10-11, 16; 39:2-

3 చూడండి)."[16]

*రాజ్యాల యొక్క భద్రత దేవుని చేతిలో ఉంది.* దేవుని ప్రజలను బానిసత్వంలో ఉంచి మరియు వారిని బాధపెట్టుట వలన, ఇశ్రాయేలీయుల శిశువులను చంపుట వలన, మరియు దాని రాజు యొక్క హృదయ కాఠిన్యం వలన ఐగుప్తు శిక్షించబడింది (4:22, 23). మానవులందరికీ సంబంధించిన ధర్మశాస్త్రమును తిరాస్కరించిన, తన ప్రజలను బాధించిన మరియు ఒకరి యెడల మరొకరి క్రూరత్వము మరియు అరాచకమును ప్రదర్శించిన ఇతర రాజ్యాలు కూడా దేవునికి లెక్కయప్పగించవలసిన అవసరం ఉంది (ఆమోసు 1; 2 చూడండి).[17]

*ఆయన ప్రజలు ఇతర రాజ్యాల పట్ల మంచిగా ప్రవర్తించాలని కోరుకొంటున్నాడు.* అబ్రాహాము సంతానం "ఆశీర్వాదముగా" ఉంటారు (ఆది. 12:2). ఇశ్రాయేలీయులు కానివారిని (అన్యులను) ఇశ్రాయేలీయులు వివాహము చేసికొనకూడాదు లేదా వారితో నిబంధన చేసికొనకూడాదు, మరియు ఇశ్రాయేలులో అన్యులు భూమిని సొంతం చేసుకోకూడాదు లేదా రాజు అవ్వకూడాదు. అయితే, దేవుని ప్రజలు ఇతర ప్రజలతో ఉండడం ఎన్నడూ నిషేధించబడలేదు. వాస్తవానికి, ఇశ్రాయేలీయులు కానివారు (తరువాత అన్యులుగా పిలువబడ్డారు) ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచినప్పుడు వారితో కూడా ఉన్నారు (12:38). "అపరిచితులు" అనగా విదేశీయుల పట్ల ఇశ్రాయేలీయుల యొక్క ప్రవర్తనను క్రమబద్ధీకరణ చేయుటకు ఇవ్వబడిన చట్టము (ధర్మశాస్త్రము) అను సత్యము ద్వారా ఇశ్రాయేలీయులు ఒక రాజ్యంగా ఉన్నప్పటి నుండి కూడా ఇశ్రాయేలీయులతో పాటుగా అన్యులు కూడా ఉన్నారని తెలియజేయబడింది (12:48, 49; 20:10; 22:21; 23:9, 12; లేవీయకాండముయ. 19:10). "నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుము" అని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపించబడ్డారు కాబట్టి (లేవీయ. 19:18), ప్రజలు కూడా "అపరిచితులను నిన్ను వలె ప్రేమించాలి" (లేవీయ. 19:34). ప్రధమంగా, ఇశ్రాయేలీయులకు సంబంధించిన నియమాలు తమ మధ్య నివసిస్తున్న "పరదేశులకు" కూడా వర్తిస్తాయి (12:49; సంఖ్యా. 15:30; 35:15).

తరువాత కాలంలో, అన్యులను అశుద్ధంగా ప్రకటించే సంప్రదాయాలను అభివృద్ధి చేసుకొన్నారు. సాధ్యమైనంత వరకు యూదులు అన్యుల నుండి తప్పించుకొంటున్నారు, మరియు విశ్వాసమైన యూదులు అన్యులతో తినకూడాదు. అలాటి సంప్రదాయాలు దేవుని ధర్మశాస్త్రంలో భాగం కాదు. అవిశ్వాసులు దేవుని ప్రజల మధ్య ఎల్లప్పుడు నివసించవచ్చు మరియు దేవుని ప్రజలు ఒకరిపైనొకరు శ్రద్ధ వహిస్తున్నట్లే వారిపైన కూడా శ్రద్ధ వహించాలనేదే మోషే ధర్మశాస్త్రం చెప్తుంది.

*అన్ని రాజ్యములు ఆయనను తెలుసుకొని మరియు ఆయనను ఆరాధించడమే దేవుడు కోరుకొంటున్నాడు.* రాజుకు తన బలమును చూపుటకు మరియు "భూలోకమందంతట" ఆయన నామము ప్రచురము చేయుటకకే దేవుడు పది తెగుళ్లను ఐగుప్తుపై రప్పించి వాటిలో కూడా ఫరోను జీవింపజేసాడు (9:16). దేవుడు నిర్గమకాండములో చేసిన అద్భుత కార్యములు ఇతర దేశములకు కూడా తెలియబడతాయి (యెహో. 2:9, 10), దీని ఫలితంగా "భూలోకమందంతట" ఆయన

నామము ప్రచురపరచబడుతుంది. దేవుని ప్రణాళిక ఏంటంటే అబ్రాహాము సంతానం ద్వారా "భూమి యొక్క సమస్త వంశములు ఆశీర్వదించబడతాయి" (ఆది. 12:3). ప్రణాళిక నెరవేర్చబడువాని ద్వారా ఇశ్రాయేలు ఒక రాజ్యంగా మారింది. "అన్యజనులకు వెలుగై యుండునట్లు" దేవుడు ఇశ్రాయేలీయులను నియమించెను (యెష. 49:6) ఫలితంగా దేవుని ప్రజలద్వారా ఇతరులు "పరమదేవుడు పరమ ప్రభువు" ఎవరో తెలుసుకొంటారు (ద్వితీ. 10:17). చివరకి, రాజ్యాలను రక్షణకర్తను లోకములోకి తెచ్చుటకు దేవుడు ఇశ్రాయేలును వాడుకొన్నాడు.

*ముగింపు.* యూదుల పట్ల మాత్రమే దేవుడు శ్రద్ధ కలిగియున్నాడని మనం ఒకవేళ ఆలోచిస్తే మనం పాత నిబంధనను అపార్థం చేసుకొన్నట్లే. దేవుడు ఇతర రాజ్యాలను కూడా ప్రేమించాడు (యోనా 1-4) మరియు ఆయనను తెలుసుకొనుటకు యూదులు ఒక సాధనంగా ఉండాలని ఆశించాడు. "అన్యులకు వెలుగుగా ఉండడం" ఇశ్రాయేలీయుల యొక్క బాధ్యతైతే మనకింకెంత బాధ్యత ఉండాలి? దేవుని శ్రద్ధ రాజ్యముల పైపైతే, ఈరోజు మనకిది పరిచర్య పిలుపు!

## దేవుడు చెడును ఎందుకు అనుమతిస్తున్నాడు (9:16)

ఆయన తన ముగింపును సాధించేందుకే దేవుడు ఫరోను తన అధికారంలో ఉంచాడు (9:16). మానవజాతంతటికీ అత్యున్నతమైన దేవుడే అధికారి కాబట్టి ఆయన కోరుకొన్నవారిని ఆయన నియమిస్తాడు (దాని. 4:17, 25, 32; 5:21). కొన్నిసార్లు దేవుడు తన ప్రణాలికను నెరవేర్చడానికి, చెడును గాని లేదా చెడ్డ పాలకులను గాని తమ అధికారంలోనే ఉంచుతాడు. దేవుని ప్రణాళిక ఏంటి? ఆయన నామము మరియు ఆయన బలము భూలోకమంతటికీ తెలియాలి.

## ఫరో సేవకులలో నమ్మకస్తులు (9:20)

"ఫరో సేవకులలో . . . కొందరు యెహోవా మాటకు భయపడినవారు" (9:20). బహుశా ఈ విశ్వాసులు ఫరో యొక్క అంతర్గత మంత్రిమండలిలో వారు, ఎందుకంటే ఈ విధంగానే నిర్గమకాండంలో "సేవకుడు" అను పదం ఉపయోగించబడింది (7:10, 20; 8:3, 4 చూడండి). క్రొత్త నిబంధనలో కొంతమంది "పరిశుద్ధులు" "కైసరు ఇంటివారు" (ఫిలిప్పీ. 4:22). మనం శత్రువులుగా పరిగణించేవారు (ఇశ్రాయేలీయులు ఐగుప్తీయులను పరిగణించిన విధంగా) లేదా అధికారంలో ఉన్నవారు దేవుని వాక్యము యొక్క సత్యము చేత ఒప్పించబడరు లేదా పశ్చాత్తాపడరు అని మన ఆలోచించకూడాదు.

## ఫరోకు పశ్చాత్తాపం లేకపోవడం (9:27-35)

వడగండ్లవాన తెగులు తరువాత, ఫరో తన పాపమును మరియు తన ప్రజల పాపమును ఒప్పుకొన్నాడు. ప్రజలు తమ పాపములను తెలుసుకొని వాటిని

ఒప్పుకోవాలని దేవుడు ఎల్లప్పుడు కోరుకొంటాడు (కీర్త. 32:1-5; 51:1-4; లూకా 15:18; 18:13; యాకోబు 5:16; 1 యోహా. 1:9). అయితే, ఫరో ఒప్పుకోలులో ఏదో లోపం ఉంది. అది, నిజాయితీ లేకపోవడం, లేదా అది తప్పుడు ఉద్దేశం ద్వారా కలిగియుండవచ్చు. అతని ఇబ్బంది ద్వారా అతడు పాపమును ఒప్పుకొని యుండవచ్చు. ఒపుకోలు నిజాయితే ఉన్న లేదా లేకపోయినా, అది మాత్రం తన జీవితంలో మార్పును కలిగించలేదు. అతడు వెంటనే పాత విధానములోకి (పాత జీవితం) వెళ్లిపోయాడు. దేవునికి ఇష్టమైన విధంగా ఉండాలంటే, పశ్చాత్తాపంపాటు పాపమును ఒప్పుకోవాలి మరియు ప్రవర్తనలో మార్పును అది కలిగించాలి (లూకా 3:10-14; 2 కొరింథీ. 7:9, 10).

---

సూచనలు

[1]J. Philip Hyatt, *Exodus*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 116. [2]John J. Davis, *Moses and the Gods of Egypt: Studies in Exodus*, 2d ed. (Grand Rapids, Mich.: Baker Book House, 1986), 119. [3]Ibid.; Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* (New York: Schocken Books, 1996), 72; R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 96. [4]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 118. [5]Wilbur Fields, *Exploring Exodus,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 201-2. [6]ఇశ్రాయేలీయులు పశువులను పొందుకున్నారను సత్యము వారు భరించిన బానిసత్వపు స్వభావమును గుర్తించడంలో ముఖ్యమైనదిగా ఉండవచ్చు. [7]Durham, 116. [8]Ibid., 119. [9]William A. Shell, "Furnace," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:371. [10]Alexander Macalister and R. K. Harrison, "Boil," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:532.

[11]Waldemar Janzen, *Exodus*, Believers Church Bible Commentary (Scottdale, Pa.: Herald Press, 2000), 126. [12]Durham, 129. [13]ఏ పాపమును గూర్చి ఫరో దోషిగా ఉన్నాడు? అది అవిధేయత కలిగించిన అహంకారం కావచ్చు. ఒకవేళ ఈ అనువాదం సరియైనదైతే, పాత నిబంధన కాలంలో కూడా ఇశ్రాయేలీయుల నుండి మరియు అవిశ్వాస రాజ్యాల నుండి కూడా దేవుడు విధేయతను కోరుకుంటున్నాడను ముగింపును అనుసరిస్తుంది. [14]W. H. Gispen, *Exodus*, trans. Ed van der Maas, Bible Student's Commentary (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1982), 103. [15]J. Alec Motyer, "The Prophets," in *Eerdmans' Handbook to the Bible*, ed. David Alexander and Pat Alexander (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1973), 372. [16]Ibid. [17]పాత నిబంధన గ్రంథములో ఇశ్రాయేలీయులతో కాకుండా ఇతర రాజ్యాలతో దేవుని సంకర్షనను Douglas S. Huffman క్లుప్తంగా చెప్పాడు: "దేవుడు అవిశ్వాసులైన అన్యదేశములపై సార్వభౌమాధికారం చేసి, ఇశ్రాయేలీయులను క్రమపరచుటకు (హబక్కూకు) మరియు వారిని మారుమనస్సుకొరకు పిలుచుటకు (యోనా) మరియు వారిపై శిక్ష ప్రకటించుటకు (నహూము,

ఓబద్యా) వారి వాడుకొన్నాడు)" (Douglas S. Huffman, "Gentile," in *The Eerdmans Dictionary of the Bible*, ed. David Noel Freedman [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2000], 494-95).